స్మార్ట్ ఫోన్‌కు చెక్‌పెట్టే ఏఐ పిన్!

న్యూయార్క్, నవంబర్ 16: స్మార్ట్ ఫోన్‌కు ప్రత్యామ్నాయంగా వాడుకొనేలా ఓ బుల్లి గ్యాడ్జెట్‌ను అమెరికాకు చెందిన స్టార్టప్ హ్యూమానే ఆవిష్కరించింది. ఇది స్మార్ట్‌ఫోన్ తరహాలో అన్ని పనులూ చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఈ డివైజ్‌కు కంపెనీ 'ఏఐ పిన్'గా నామకరణం చేసింది. ఇది ఎలాంటి స్క్రీన్‌లేని ధరించగలిగే పరికరం. చాలా చిన్నగా ఉండటంతో దీన్ని మన దుస్తులకు ఎక్కడైనా అతికించుకోవచ్చు. కెమెరా, మైక్రోఫోన్, యాక్సెలరోమీటర్, సెన్సార్లు ఉంటాయి. ఇది సెన్సార్లు, ఏఐ టెక్నాలజీ ఆధారంగా పనిచేస్తుంది. ఈ డివైజ్‌తో స్మార్ట్‌ఫోన్ తరహాలో కాల్స్, మెసేజెస్ చేసుకోవచ్చు. ఫొటోలు తీసుకోవచ్చు. వీడియోలను రికార్డు చేసుకోవచ్చు. ఇందులో ఉండే బిల్ట్ ఇన్ ప్రొజెక్టర్ సహాయంతో ఇందులోని సమాచారాన్ని చేతులపైనా లేదా గోడలపైనా ఎక్కడైనా డిస్‌ప్లే చేయొచ్చు. అలాగే, ఈ బుల్లి డివైజ్ సహాయంతో ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను మనం ఉన్నచోట నుంచే కంట్రోల్ కూడా చేయొచ్చు.

ఉత్తరప్రదేశ్‌లో ఘోరం

మహిళ పై గ్యాంగ్‌రేప్ సిగరెట్లతో కాల్చిన దుండగులు

బిజ్నూర్ (యూపీ): బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లో శాంతిభద్రతలు దారుణంగా ఉన్నాయి. ఓ వ్యాపారస్తుడు లక్ష్యంగా రెండుసార్లు దొంగతనం జరిగింది. తొలిసారి దొంగతనం జరిగినప్పుడు పోలీసులు కేసు నమోదు చేసి చర్యలు తీసుకునుంటే రెండోసారి దొంగతనం జరిగి ఉండేది కాదు. ఆ వ్యాపారి భార్య లైంగికదాడికి గురయ్యేదికాదు. ఈ దారుణ ఘటన బిజ్నూర్ జిల్లాలో చోటుచేసుకున్నది. గత నెల 19న తొలిసారి దొంగతనం జరిగినప్పుడు పోలీసులకు ఫిర్యాదు చేస్తే పట్టించుకోలేదు. మళ్లీ వ్యాపారి ఇంట్లోకి చొరబడిన దొంగలు ఆయన భార్యను కట్టేసి లైంగికదాడికి పాల్పడ్డారు. సిగరెట్లతో కాల్చారు. బంగారం, వెండి, నగదును ఎత్తుకెళ్లారు.

యూఏఈలో మనోడికి జాక్‌పాట్

రూ.45 కోట్ల లాటరీ

దుబాయ్, నవంబర్ 16: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లో నివసిస్తున్న భారతీయుడు శ్రీజును అదృష్టం వరించింది. ప్రతివారం నిర్వహించే మహ్జూజ్ డ్రాలో రూ.45.30 కోట్లు గెలుచుకున్నాడు. గ్యాస్ పరిశ్రమలో ఆపరేటర్‌గా పని చేసే శ్రీజు గత మూడేండ్లుగా ఈ డ్రాలో పాల్గొంటున్నాడు. ఏదో ఒక రోజు అదృష్టం వరించకపోతదా అన్న ఆశతో ఎదురుచూస్తున్న అతడికి ప్రస్తుతం కలిసొచ్చింది. ఈ సందర్భంగా శ్రీజు మాట్లాడుతూ ఈ ఆనంద సమయంలో నోటి నుంచి మాటలు కూడా రావడం లేదని చెప్పాడు.

బీహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వకుంటే ఉద్యమిస్తాం: నితీశ్

పాట్నా, నవంబర్ 16: కేంద్రం సాధ్యమైనంత త్వరగా తమ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ స్పష్టంచేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించాలని కొన్నేండ్లుగా డిమాండ్ చేస్తూ వస్తున్న జేడీ(యూ) నేత నితీశ్‌కుమార్.. తమ డిమాండ్‌ను కేంద్రం తక్షణమే అమలుచేయాలని కోరారు. గురువారం పాట్నాలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రానికి కేంద్రం ప్రత్యేక హోదాను ప్రకటిస్తే రెండున్నరేండ్లలో ప్రజల డిమాండ్లను నెరవేరుస్తామని చెప్పారు.

నేడు తెరుచుకోనున్న శబరిమల ఆలయం

తిరువనంతపురం: కేరళలోని సుప్రసిద్ధ శబరిమల అయ్యప్ప స్వామి దేవాలయానికి గురువారం భక్తులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. మండల-మకరజ్యోతి వార్షిక పూజల కోసం ఈ దేవాలయాన్ని శుక్రవారం తెరవబోతుండటంతో భక్తులు స్వామివారి దర్శనం కోసం వందలాదిగా తరలివచ్చారు. శబరిమల యాత్ర సీజన్ 41 రోజులపాటు ఉంటుంది.

ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో నేడు పోలింగ్

ఎంపీలో 230 స్థానాలకు ఒకే దశలో ఎన్నికలు

రెండో విడతలో ఛత్తీస్‌గఢ్‌లో 70 స్థానాలకు ఓటింగ్

భోపాల్, నవంబర్ 16: ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు కీలక దశకు చేరుకున్నాయి. మధ్యప్రదేశ్‌లో ఒకే విడతలో మొత్తం 230 స్థానాలకు, ఛత్తీస్‌గఢ్‌లో రెండో, చివరి విడతలో 70 స్థానాలకు శుక్రవారం పోలింగ్ జరుగనున్నది. ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మధ్యప్రదేశ్‌లో మొత్తం 5.6 కోట్లమంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళా ఓటర్ల సంఖ్య 2.72 కోట్లు కాగా, పురుష ఓటర్లు 2.88 కోట్లు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో 22.36 లక్షల మంది యువతీయువకులు మొదటిసారిగా తమ ఓటుహక్కును వినియోగించబోతున్నారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాలతో కూడిన అసెంబ్లీ స్థానాలు 150 వరకు ఉండటంతో రైతుల ఓట్లు కీలకంగా మారాయని ఎన్నికల విశ్లేషకులు భావిస్తున్నారు.

బఘేల్ భవితవ్యం ఏమిటో?

ఛత్తీస్‌గఢ్‌లో శుక్రవారం రెండో దశ పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మిగిలిన 70 స్థానాల్లో సీఎం భూపేశ్ బఘేల్ సర్కార్‌పై ఓటర్లు తీర్పు చెప్పబోతున్నారు. రెండో దశ పోలింగ్‌లో సీఎం భూపేష్ బఘేల్, డిప్యూటీ సీఎం టీఎస్ సింఘ్‌దేవ్, మరో 8మంది మంత్రులు పోటీ చేస్తున్న స్థానాలున్నాయి. మొత్తం 90 స్థానాలున్న ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీకి నవంబర్ 7న మొదట దశలో 20 స్థానాల్లో ఎన్నికలు నిర్వహించారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతంలో మునుపెన్నడూ లేనంతగా రికార్డ్ స్థాయిలో 78 శాతం ఓటింగ్ నమోదైంది. అధికార కాంగ్రెస్, విపక్ష బీజేపీ మధ్య ప్రధాన పోటీ నెలకొన్నది. మొత్తం 22 జిల్లాల్లో విస్తరించిన 70 అసెంబ్లీ స్థానాల్లో మొత్తం 958 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. 1.63 కోట్లమంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించబోతున్నారు. ఇందుకోసం మొత్తం 18,833 పోలింగ్ బూత్‌లను ఏర్పాటుచేసినట్టు ఎన్నికల అధికారులు తెలిపారు.

బీజేపీ అభ్యర్థి వాహనంలో పట్టుబడ్డ రూ.11.50 లక్షలు

ఛత్తీస్‌గఢ్ శాసనసభ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే రామ్ దయాళ్ యాకీ వాహనంలో రూ.11.50 లక్షల నగదును పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. కోర్బా జిల్లాలోని పాలి-తనఖార్ నుంచి ఆయన పోటీ చేస్తున్నారు. సోదాల సమయంలో ఈ వాహనంలో ఆయన ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఝుంకిడి గ్రామం సమీపంలో స్థానికులు అర్ధరాత్రి 1 గంట ప్రాంతంలో ఆయన కారును అడ్డగించి, పసన్ పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారని కోర్బా ఎస్‌పీ జితేంద్ర శుక్లా తెలిపారు. నగదుతోపాటు కారును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

గురువారం మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో ఎన్నికల సామగ్రిని తీసుకొని పోలింగ్ కేంద్రాలకు వెళ్తున్న సిబ్బంది

పంచతంత్రం

25 మందికిపైగా రెబల్స్

పరేషాన్‌లో రాజస్థాన్ బీజేపీ

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 16 (నమస్తే తెలంగాణ): రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్లు లభించక రెబల్స్‌గా రంగంలోకి దిగిన నేతలను బీజేపీ అగ్రనేతలు బుజ్జగించినా పెద్దగా ఫలితం కనిపించలేదు. స్వయంగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా రంగంలోకి దిగినా 25 మందికి పైగా రెబల్స్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. మాజీ సీఎం వసుంధరా రాజే వర్గానికి టికెట్ల కేటాయింపులో ప్రాధాన్యం లభించక పోవటంతో.. వారిలో చాలా మంది అధిష్ఠానానికి బుద్ధి చెబుతామంటూ స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ వేశారు. రెబల్స్‌గా పోటీ చేస్తున్న ప్రముఖుల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలు చంద్రభాన్ సింగ్, కైలాశ్ మేఘ్వాల్ , దూడీకి ఖాన్, ఆక్య రజ్వీ తదితరులు ఉన్నారు.

గవర్నర్‌గా ఉండి బీజేపీకి ఎన్నికల ప్రచారమా?

- రాజస్థాన్‌లో అస్సాం గవర్నర్ ప్రచారంపై విమర్శలు
- పదవి నుంచి తొలగించాలని టీఎంసీ, ఆప్ డిమాండ్



గులాబ్ చంద్

గువహాటి: రాజస్థాన్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించిన అస్సాం గవర్నర్ గులాబ్ చంద్ కటారియాపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్రపతి, ఎన్నికల సంఘం జోక్యం చేసుకొని ఆయనను వెంటనే పదవి నుంచి తొలగించాలని అస్సాం టీఎంపీ, ఆప్ శాఖలు డిమాండ్ చేశాయి. రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి ఎన్నికల నియామావళిని ఉల్లంఘించి ఉదయ్‌పూర్ అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి తరచణ్ జైన్‌కు మద్దతుగా కటారియా ప్రచారం చేశారని టీఎంసీ ఒక ప్రకటనలో తెలిపింది. కొన్ని రోజుల క్రితం అస్సాం అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ నుమల్ మోమిన్ మిజోరాంలో బీజేపీ మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారని... ఇప్పుడు కటారియా ఆ పని చేస్తున్నారని టీఎంసీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇది ప్రజాస్వామ్యానికి సవాల్ అని అస్సాం టీఎంసీ అధ్యక్షుడు రిపున్ బోరా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'కటారియా రాజ్యాంగ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారు. ఆయన చేసిన ప్రచారం గవర్నర్ పదవిని కించపరిచింది. భారత రాజకీయాల ప్రతిష్ఠను నాశనం చేసింది' అని ఆప్ అస్సాం సమన్వయకర్త భాబెన్ చౌదరి విమర్శించారు.

10 బిల్లులు తిప్పిపంపిన తమిళనాడు గవర్నర్

చెన్నై, నవంబర్ 16: సుప్రీంకోర్టు మందలించిన వారం రోజులకు తమిళనాడు గవర్నర్ ఆర్‌ఎన్ రవి స్పందించారు. ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం పంపిన పది పెండింగ్ బిల్లులను ఆయన గురువారం తిప్పిపంపారు. గవర్నర్లు బిల్లులను తొక్కిపెట్టడం తీవ్రమైన అంశం అని సుప్రీంకోర్టు.. తమిళనాడు, పంజాబ్ ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా వ్యాఖ్యానించింది. గవర్నర్లు నిప్పుతో చెలగాటమాడుతున్నారని విమర్శించింది. ఈ నేపథ్యంలోనే తమిళనాడు గవర్నర్ రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లులను ఆమోదించకుండా వాటిని తిప్పి పంపారు. ఈ బిల్లులను తిరిగి వచ్చిన కొద్ది వ్యవధిలోనే తమిళనాడు స్పీకర్ ఎం అప్పావు శనివారం ప్రత్యేక శాసనసభ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆ బిల్లులను యథాతథంగా మరోమారు ఆమోదించి తిరిగి గవర్నర్‌కు పంపనున్నట్టు తెలుస్తున్నది. ఇలా రెండోమారు వచ్చిన బిల్లులకు గవర్నర్ ఆమోదం తెలుపడం తప్పనిసరి.

కలవరపెడుతున్న రైలు ప్రమాదాలు

యూపీ, బీహార్ రైళ్లలో మంటలు, పేలుడు

25 మందికి గాయాలు

ఇటావా, నవంబర్ 16: రైలు ప్రమాదాలు దేశ ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఢిల్లీ-సహస్ర వైశాలి ఎక్స్‌ప్రెస్ యూపీలోని ఇటావా జిల్లాలో వెళ్తుండగా బుధవారం రాత్రి ఫ్రెండ్స్ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్-6 బోగీలో మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదంలో 21 మంది గాయపడగా, వారిని దవాఖానలకు తరలించారు. ప్రమాదానికి కారణం తెలియలేదని ఇటావా ఎస్పీ సంజయ్ కుమార్ తెలిపారు. అలాగే బీహార్‌లోని సమస్తిపూర్ రైల్వే స్టేషన్ ఔటర్‌లో సిగ్నల్ కోసం వేచి ఉన్న భాగల్పూర్-దర్భంగా ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లోని ఒక బోగీలో బుధవారం హఠాత్తుగా పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. వారిని వెంటనే దవాఖానకు తరలించారు.

ఉచిత రేషన్‌పై కేంద్రం యూటర్న్!

- ఐదేండ్లపాటు అమలుజేస్తామన్న ప్రధాని మోదీ..
- 2023 వరకే పొడిగించామని కేంద్రం తాజాగా ప్రకటన

న్యూఢిల్లీ, నవంబర్ 16: ఉచిత రేషన్ పంపిణీ (ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన) పథకాన్ని మరో ఐదేండ్ల పాటు అమలుజేస్తామని ప్రధాని మోదీ కొద్ది రోజుల క్రితం ఎన్నికల ప్రచారంలో ఆర్భాటంగా ప్రకటించారు. అయితే ఆయన మాటలు అంతా ఉత్తవేనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం తాజాగా చేసిన ప్రకటనే అందుకు కారణం. ఉచిత రేషన్ పథకం అమలును ఏడాది పొడిగించామని, అది 2023 జనవరి 1తో మొదలైందని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ, వినియోగదారుల సంబంధాల శాఖ తాజాగా ప్రకటించింది. అయితే ప్రధాని హామీకి కేంద్ర ప్రకటన విరుద్ధంగా ఉండటంతో ప్రతిపక్షాలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ప్రధాని ప్రకటన ఉత్తదేనా అని నిలదీస్తున్నాయి. 'ఉచిత రేషన్ కార్యక్రమాన్ని 2028 వరకు పొడిగిస్తున్నామని నవంబర్ 4న ప్రధాని మోదీ ప్రకటించారు. తాజాగా కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో అలా లేదు. అసలేం జరుగుతున్నది?' అని కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేశ్ కేంద్రాన్ని ప్రశ్నించారు.

డిసెంబర్ 3నే మిజోరం ఓట్ల లెక్కింపు

తేదీ మార్పునకు ఈసీ నిరాకరణ

ఐజ్వాల్, నవంబర్ 16: మిజోరంలో అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ తేదీని మార్చడానికి ఎన్నికల సంఘం(ఈసీ) తిరస్కరించింది. ఓట్ల లెక్కింపును యథా ప్రకారం డిసెంబర్ 3వ తేదీనే నిర్వహించాలని నిర్ణయించింది. ప్రస్తుతం దేశంలోని ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌ను ఈ నెలలో వివిధ తేదీలలో నిర్వహిస్తున్నప్పటికీ ఓట్ల లెక్కింపును మాత్రం డిసెంబర్ 3న చేపడతామని ఎన్నికల సంఘం ప్రకటించింది. అయితే డిసెంబర్ 3న ఆదివారం కాబట్టి క్రైస్తవులు అధికంగా ఉండే మిజోరంలో ప్రజలు ఆ రోజు చర్చిలకు వెళతారు కాబట్టి కౌంటింగ్‌ను మరో రోజుకు మార్చాలంటూ పలు పార్టీలు, పౌర సంఘాలు, సంస్థలు ఈసీకి విజ్ఞప్తి చేశాయి. ఈ విషయాన్ని కేంద్ర ఎన్నికల సంఘంతో చర్చించానని, అయితే వారు యథా ప్రకారం డిసెంబర్ 3నే కౌంటింగ్ నిర్వహించాలని ఆదేశించినట్టు మిజోరం ప్రధాన ఎన్నికల అధికారి మధ్యూప్ వ్యాస్ గురువారం తెలిపారు. పోలింగ్‌లా కౌంటింగ్ ప్రక్రియలో ప్రజలు పాల్గొనరని, వారు ఆ రోజు యథావిధిగా తమ రోజువారీ కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చు కాబట్టి ఓట్ల లెక్కింపు తేదీని ఈసీ మార్చలేదని వ్యాస్ చెప్పారు.

ఏడాది వ్యవధి మాస్టర్స్ డిగ్రీ కోర్సులు

ప్రవేశపెట్టనున్నట్టు యూజీసీ వెల్లడి

న్యూఢిల్లీ, నవంబర్ 16: ఏడాది కాల వ్యవధితో కూడిన మాస్టర్స్ డిగ్రీ (పీజీ) కోర్సులను ప్రవేశపెట్టబోతున్నామని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) తాజాగా తెలిపింది. ప్రపంచంలో వస్తున్న మార్పులను దృష్టిలో పెట్టుకొని, కొత్త సబ్జెక్ట్‌తో (యూజీలో మెయిన్ సబ్జెక్ట్ కానవసరం లేదు).. 'వన్ ఇయర్ పీజీ' కోర్సు చదివే అవకాశం కల్పిస్తున్నట్టు యూజీసీ పేర్కొన్నది. ఇందుకు సంబంధించి పీజీ కోర్సుల పాఠ్య ప్రణాళిక, క్రెడిట్ ఫ్రేమ్‌వర్క్‌ను నవంబర్ 3నాటి సమావేశంలో ఆమోదించినట్టు యూజీసీ గురువారం ఓ ప్రకటన విడుదల చేసింది. నూతన గైడ్‌లైన్స్‌పై వివిధ వర్గాలు, పౌరుల నుంచి అభిప్రాయం సేకరిస్తామని తెలిపింది. 4 ఏండ్ల యూజీ, 5 ఏండ్ల ఇంటిగ్రేటెడ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మెడిసిన్)కోర్సు, 3 ఏండ్ల యూజీతోపాటు 2 ఏండ్ల మాస్టర్స్ చదివినవారు.. ఎంఈ, ఎంటెక్‌లలో 'వన్ ఇయర్ పీజీ' చేసేందుకు అర్హులవుతారని యూజీసీ పేర్కొన్నది. 'ఈ తరహా నిబంధనలతో పీజీ కోర్సులను ప్రవేశపెట్టడం దేశంలో ఇదే మొదటిసారి' అని యూజీసీ చైర్‌పర్సన్ ఎం జగదీశ్‌కుమార్ అన్నారు. ఏడాది కాలపరిమితితో కూడిన ఎంఏ ప్రోగ్రాంను కూడా తీసుకొచ్చే ఉద్దేశముందని అన్నారు.

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఓ నియంత

మరోసారి బైడెన్ వ్యాఖ్య

కాలిఫోర్నియా: చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఓ నియంత అని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ మరోసారి వ్యాఖ్యానించారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగిన ఆసియా-పసిఫిక్ ఎకనమిక్ కోఆపరేషన్ సమావేశంలో పాల్గొనేందుకు జిన్‌పింగ్ అమెరికాకు వచ్చారు. జిన్‌సింగ్ నియంతని గతంలో బైడెన్ చేసిన వ్యాఖ్యలను మీడియా ప్రస్తావించగా.. 'అవును ఆయన నియంతే. ఆయన కమ్యూనిస్టు దేశాన్ని పాలిస్తున్నారు' అని బైడెన్ అన్నారు.

స్పెయిన్ ప్రధానిగా పెడ్రో ఎన్నిక

మాడ్రిడ్: స్పెయిన్ ప్రధానిగా పెడ్రో శాంచెజ్ ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆయన తాత్కాలిక ప్రధానిగా వ్యవహరిస్తున్నారు. అయితే కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో భాగంగా పార్లమెంట్ దిగువ సభలో ఓటింగ్ జరిగింది. మొత్తం 350 మంది సభ్యుల్లో 179 మంది పెడ్రోకు అనుకూలంగా ఓటు వేశారు.

మన పాస్‌వర్డ్ 123456!

దేశంలో అత్యధికంగా వాడుతున్నది ఇదే

న్యూఢిల్లీ, నవంబర్ 16: సైబర్ దాడులు పెరుగుతున్నప్పటికీ యూజర్లు ఇప్పటికీ బలహీన పాస్‌వర్డ్‌లనే వాడుతున్నట్టు తాజా అధ్యయనంలో తేలింది. '123456' అనే పాస్‌వర్డ్‌ను ప్రపంచవ్యాప్తంగా చాలా కామన్‌గా ఉపయోగిస్తున్నట్టు పాస్‌వర్డ్ మేనేజ్‌మెంట్ సొల్యూషన్ కంపెనీ 'నార్డ్‌పాస్' తాజా నివేదికలో పేర్కొంది. తమ లొకేషన్‌ను తెలిపే పాస్‌వర్డ్‌లను కూడా యూజర్లు ఉపయోగిస్తున్నారు. ఈ జాబితాలో 'ఇండియా@123' అనేది జాబితాలో అన్నింటికంటే పైన ఉంది. అలాగే, 'అడ్మిన్' అన్న పాస్‌వర్డ్‌ను కూడా ఎక్కువమంది ఉపయోగిస్తున్నారు. 'పాస్@123', 'పాస్‌వర్డ్@123' అన్నవి కూడా చాలా కామన్‌గా కనిపిస్తున్నట్టు నివేదిక పేర్కొంది. ప్రపంచంలోని పాపులర్ పాస్‌వర్డ్‌లలో మూడోవంతు (31శాతం) '123456789', '12345', '00000' వంటి పూర్తి నంబర్లు కలిగినవేనని తెలిపింది. నివేదిక ప్రకారం ప్రపంచంలోని 70 శాతం పాస్‌వర్డ్‌లను సెకనులోపే తెలుసుకోవచ్చు.

బెంగళూరులో ఆమెకు భద్రతేదీ?

- కారులోని మహిళ లను వెంబడించిన దుండగులు
- వాహనాలతో ఢీ కొట్టి కిందకు దిగాలని ఒత్తిడి
- స్నేహితుల సాయంతో రక్షణ పొందిన బాధితులు
- విషయాన్ని ఎక్స్‌లో షేర్ చేసిన ఒక బాధితురాలి భర్త
- నగరంలో ఇటీవల మహిళ లపై పెరిగిపోతున్న దాడులు

బెంగళూరు, నవంబర్ 16: కాంగ్రెస్ పాలిత కర్ణాటక రాజధాని బెంగళూరులో మహిళలకు భద్రత కరువవుతున్నది! నేరగాళ్లు మహిళలను వెంబడించి వేధిస్తున్నారు. ఇటీవల ఈ తరహా ఘటనలు అనేకం చోటు చేసుకుంటున్నాయి. ఈ నెల 8న రాత్రివేళ కొందరు ఉద్యోగినులకు ఇలాంటి ఇబ్బందికర పరిస్థితే ఎదురైంది. కొందరు మగవాళ్లు వాళ్లు ప్రయాణిస్తున్న కారును వెంబడించారు. బాధితుల్లో ఒకరి భర్త శ్రీజన్ ఆర్ షెట్టి ఈ విషయాన్ని 'ఎక్స్'లో షేర్ చేశారు. దీనిపై నెటిజన్లు తీవ్రంగా స్పందించారు. కొందరు తమకు ఎదురైన ఇబ్బందులను ప్రస్తావించారు. శ్రీజన్ ఆర్ షెట్టి జరిగిన ఘటన గురించి ఇలా పోస్ట్ చేశారు... 'నేనెప్పుడూ బెంగళూరులో అభద్రతకు లోనవలేదు. కానీ రాత్రి పది గంటల తర్వాత నగరంలోని కొన్ని ప్రాంతాలు ఎంత సురక్షితం కావో గత బుధవారం తెలిసొచ్చింది. ఈ నెల 8న నా భార్య తన ఇద్దరు సహోద్యోగినులు, ఒక సహోద్యోగికి సర్జాపూర్ నుంచి క్యాబ్ దొరకడం కష్టమని డ్రాప్ ఆఫర్ చేశారు. వారి కారును ఒక గుంపు కొన్ని కిలోమీటర్ల వరకు వెంబడించింది' అని ఆయన తెలిపారు. నిందితులు తన భార్యను, ఆమె సహోద్యోగులను కారులోంచి దిగమని అడిగినా వారు కారు దిగలేదని.. కొందరు టెంపో డ్రైవర్లు తన భార్య కారును ఢీ కొట్టి కిందకు దిగమని ఒత్తిడి చేశారని శ్రీజన్ తెలిపారు. ఈ తతంగాన్ని చూస్తున్న వారెవరూ కారులోని వారికి సాయం చేయలేదని శ్రీజన్ వాపోయారు. అయితే తన భార్య తెలివిగా వ్యవహరించి ప్రధాన రహదారిలో కారును ఆపి విషయాన్ని పోలీసులకు తెలిపిందని చెప్పారు. 'పోలీసులను, నన్ను, తన పది మంది స్నేహితులను ఘటనా స్థలికి రావాలని ఆమె కోరకపోయుంటే పరిస్థితి మరో విధంగా ఉండేది. ఈ నగరానికి ఇప్పుడే భద్రత కావాలి. సర్జాపూర్ ఇలాంటి ఘటనలకు కేంద్ర బిందువైంది, ఇలాంటివాటికి మనం పరిష్కారం కనుక్కోవాలి' అని శ్రీజన్ పోస్ట్ చేశారు. శ్రీజన్ పోస్టుపై స్పందించిన నెటిజన్లు తమకు ఎదురైన అలాంటి ఇబ్బందికర ఘటనలను షేర్ చేశారు.

హైదరాబాద్‌లో పటిష్ఠ భద్రత

తెలంగాణలోని హైదరాబాద్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళల భద్రతకు పటిష్ఠ చర్యలు తీసుకుంటున్నది. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా షీ టీమ్స్‌ను ఏర్పాటు చేసింది. మఫ్టీలో ఉన్న మహిళా పోలీసులు రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాల్లో నిత్యం సంచరిస్తూ మహిళల భద్రతకు భరోసా ఇస్తున్నారు. మహిళల నుంచి వచ్చే ఫిర్యాదులకు తక్షణం ప్రతిస్పందిస్తున్నారు.

కర్ణాటకలో 'సీఎం ట్యాక్స్'

మొదటిపేజీ తరువాయి...

బదిలీ కావాలి? ఎవరికి ఏ పదవి ఇవ్వాలి? అనేవి మొత్తం ఈయనే డిసైడ్ చేస్తాడట. ఒక రకంగా యతీంద్ర షాడో సీఎం అని జోరుగా ప్రచారం జరుగుతున్నది. దాన్ని నిజం చేస్తూ బహిరంగంగానే యతీంద్ర ఏకంగా తన తండ్రికి ధమ్కీ ఇస్తున్న వీడియో ఇప్పుడు ఆ రాష్ట్రంలో చర్చనీయాంశమైంది. తాను చెప్పిన అధికారులను మాత్రమే బదిలీచేయాలని సీఎం సిద్ధరామయ్యకు యతీంద్ర ఫోన్ చేసి చెప్పడం కాంగ్రెస్ దోపిడీకి సాక్ష్యమని బీజేపీ, జేడీఎస్ దుమ్మెత్తిపోస్తున్నాయి. తన కొడుకు నిర్వాకం బహిరంగంగా కనిపిస్తున్నా.. సిద్ధరామయ్య మాత్రం తమను తాము సమర్థించుకొనే ప్రయత్నం చేస్తున్నారు.

ఏం జరిగింది?

యతీంద్ర ఇటీవల తన తండ్రికి ఫోన్‌చేశాడు. 'హలో అప్ప (నాన్న).. వివేకానంద ఎక్కడి నుంచి వచ్చాడు? నేను ఆ పేరు ఇవ్వలేదు. ఫోన్ మహదేవకు ఇవ్వు.. నేను ఇచ్చింది ఐదు పేర్లే..(కొద్ది క్షణాల తర్వాత) మహదేవ.. నువ్వు వేరేది (లిస్టు) ఎందుకు ఇచ్చావు? అది నీకు ఎవరిచ్చారు? ఏది ఏమైనా నేనిచ్చిన నలుగురు ఐదుగురి పని మాత్రమే కావాలి.. అంతే!' అని హుకుం జారీచేశారు. యతీంద్రతో మాట్లాడిన మహదేవ అనే వ్యక్తి సీఎం సిద్ధరామయ్యకు ఓఎస్డీగా పనిచేస్తున్నారు.

కొడుకు.. తండ్రి.. మధ్యలో డీకేఎస్

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే దోపిడీ మొదలుపెట్టేశారనే ఆరోపణలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. వాటికి బలం చేకూరుస్తూ అనేక ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. ముఖ్యంగా వైఎస్టీ జోరుగా వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. వైఎస్టీ అంటే యతీంద్ర సిద్ధరామయ్య ట్యాక్స్. అధికారాన్ని అడ్డం పెట్టుకొని తండ్రి ఒకవైపు, కొడుకు ఇంకోవైపు వసూళ్లకు తెగబడ్డారని ప్రతిపక్షాలు దుమ్మెత్తిపోస్తున్నాయి. అధికారుల బదిలీ నుంచి కాంట్రాక్టర్ల వద్ద కమీషన్ల వరకు ఎక్కడా వదలకుండా వసూళ్ల పర్వం కొనసాగుతున్నదని సమాచారం. తండ్రీ కొడుకుల దోపిడీ ఇలా ఉంటే.. మధ్యలో సందులో సడేమియా అన్నట్టు కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ (డీకేఎస్) తనవంతుగా శక్తివంచన లేకుండా దోచుకొంటున్నారని ఆ రాష్ట్ర కాంట్రాక్టర్లే దుమ్మెత్తిపోస్తున్నారు. ప్రతి కాంట్రాక్టులోనూ డీకేఎస్ ఏకంగా 50 శాతం కమీషన్ వసూలు చేస్తున్నట్టు ఆరోపణలు గుప్పుమన్నాయి.

అమ్మకానికి పోస్టింగులు

కర్ణాటకలో గత బీజేపీ ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయి ప్రజలు నానా అవస్థలు పడ్డారు. '40 పర్సె